# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.**

2. **రాష్ట్రంలోని 3 ఎమ్మెల్సీ స్థానాలకూ ఈ ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది.**

3. **మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక 'ఈగల్' వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు హోంశాఖమంత్రి వంగలపూడి అనిత శాసనసభలో తెలిపారు.**

4. **పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**

5. **రాష్ట్రవ్యాప్తంగా 1.02 లక్షల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ అందించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.**

==========================

భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా ఈ ఉదయం ఆయన గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లాలో ఉన్న గిర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అందులో భాగంగా నరేంద్రమోదీ లయన్ సఫారీ చేశారు. రాబోయేతరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వన్యప్రాణులను సంరక్షించడంలో భారతదేశం చేస్తున్న కృషికి గర్వపడుతున్నట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని 3 ఎమ్మెల్సీ స్థానాలకూ ఈరోజు ఉదయం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి విశాఖ-విజయనగరం, శ్రీకాకుళం ఉపాధ్యాయ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ లెక్కింపు ఏలూరు సమీపంలోని సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో, ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు గుంటూరు ఏసీ కాలేజీలో కొనసాగుతోంది. అధికారులు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటుచేశారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి పట్టభద్రుల స్థానానికి అత్యధికంగా 35 మంది, కృష్ణా-గుంటూరు స్థానానికి 25 మంది, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానానికి పదిమంది పోటీలో ఉన్నారు.

-------------------------

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక 'ఈగల్' వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈరోజు శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున 26 నార్కోటిక్ సెల్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గత 8 నెలల్లో 11వేల ఎకరాల గంజాయి సాగును 100 ఎకరాలకు నియంత్రించామని తెలిపారు. రాష్ట్రంలోని 7 మండలాల్లో 375 గ్రామాల్లో 20 హాట్ స్పాట్ లను గుర్తించి గంజాయి సాగు లేకుండా చేశామని హోంమంత్రి తెలియజేస్తూ...

వాయిస్ ..32 సెకన్లు

-------------------------

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో పాఠశాలల్లో సదుపాయాలపై సభ్యులు అడిగిన ప్రశ్నకు విద్య శాఖ మంత్రి సమాధానం ఇచ్చారు. ఉపాధి హామీ పథకం కింద దశలవారీ మౌలిక సదుపాయాల కల్పిస్తామని చెప్పారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే క్యాంపెయిన్ ను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి పాఠశాలలో ఈగల్ టీంలు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేస్తూ..

వాయిస్...29 సెకన్లు

పీఎం కుసుమ్ సోలార్ యోజనా పథకాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు 40 వేల 336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని మంత్రి వివరిస్తూ...

వాయిస్..33 సెకన్లు

-------------------------

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న 'ఉమెన్ సేఫ్టీ' యాప్‌ను అదనపు ఫీచర్లతో అందుబాటులోకి తీసుకురానున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. అలాగే ప్రత్యేక మహిళా రక్షణ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. హెల్ప్‌లైన్ నంబర్లు 112, 181, 1098 పై విస్తృత అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు మహిళా సాధికారిక వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డీజీపీ కార్యాలయం పేర్కొంది.

-------------------------

రాష్ట్రవ్యాప్తంగా 1.02 లక్షల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణతోపాటు మిషన్లను అందించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. మహిళల ఉపాధి కల్పనకుగాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిన్న ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ నెల 8 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నారు. లబ్ధిదారులకు

అనుగుణంగా 45 రోజుల నుంచి 90 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని అన్నారు. తొలి విడతగా 46 వేల 44 మంది బీసీలకు, 56 వేల 788 మంది ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు–ఈడబ్ల్యూఎస్‌కు చెందిన మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తామని వివరించారు. ఇందుకోసం ప్రభుత్వం 255 కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని మంత్రి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశలోని అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణ పూర్తి చేసిన ప్రొబేషనరీ ఎస్సైలు ఏలూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో ఐజీ జి.వి.జి.అశోక్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ పరిధిలో ఎంపికైన ప్రొబేషనరీ ఎస్సైలకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పోలీస్ శాఖలోకి కొత్తగా చేరుతున్న అధికారులు విధి నిర్వహణలో జవాబుదారీతనం పాటిస్తూ, బాధితులకు న్యాయం, ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా పని చేయాలని సూచించారు. ఏలూరు రేంజ్ పరిధిలో 100 మంది ప్రొబేషనరీ ఎస్సైలు ఎంపిక కాగా అందులో 68 మంది పురుషులు, 32 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు.

---------------------------

పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణంలో వినియోగిస్తున్న కాంక్రీట్ నాణ్యతను సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ – సీఎస్ఎంఆర్ఎస్ నుంచి వచ్చిన నిపుణులు లలిత్‌కుమార్ సోలంకి, సీబీశర్మ నిన్న తనిఖీ చేశారు. మిశ్రమాలను కలిపే పద్ధతిని పరిశీలించి, సమీపంలోని ప్రయోగశాల వద్ద కొన్ని పరీక్షలు నిర్వహించారు. డయాఫ్రం వాల్ ప్యానల్‌లో కాంక్రీట్ వేసే పనులను పరిశీలించారు. ఈ పరీక్షలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

---------------------------

ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన పథకం ద్వారా తక్కువ దరలకే ఔషధాలు కొనుగోలు చేస్తున్నామని తిరుపతి జిల్లా వాసి రీటా తెలిపారు. 2008లో ప్రారంభించిన జన్ ఔషధి పథకం పరిధిని విస్తరించడానికి 2016లో ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజనగా మార్చారు. ఈ పథకం కింద తిరుపతి జిల్లాలో 28జనరిక్ ఔషధ కేంద్రాలు ఉన్నాయి. దీని ద్వారా తమకు తక్కువ ధరకే మందులు లభిస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ....

వాయిస్ ..17 సెకన్లు

---------------------------

ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నారు. ప్రజల్లో వినికిడి లోపాన్ని నివారించి, శ్రవణేంద్రియం పట్ల జాగ్రత్తలు తీసుకునేలా చైతన్య పరిచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 2007 నుంచి ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

====================